నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గోల్కొండ: మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. లంగర్‌హౌస్ సబ్‌స్టేషన్, పెన్షన్ పురా ఫీడర్ పరిధిలోని లంగర్‌హౌస్ క్రాస్ రోడ్స్, పెన్షన్ పురా, గోల్లబస్తీ, బగ్దత్ కాలనీ, అహ్మద్ కాలనీ, కంపెనీ బాగ్, ఇందిరానగర్, ఫ్లోర్ మిల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 వరకు అంతరాయం ఉంటుందన్నారు. ఫతేదర్వాజా 11 కేవీ ఫీడర్ పరిధిలోని ఫతేదర్వాజా, చోటా బజార్, పోస్టు ఆఫీస్, సాత్ గల్లీ, దాన్ కోట, బడా బజార్, సాలే నగర్ కంచె ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. మోతీ మహల్ సబ్‌స్టేసన్ కంపెనీ బాగ్ ఫీడర్ పరిధిలోని మోతీదర్వాజా, అఫ్జన్ కాలనీ, కంపెనీ బాగ్, అహ్మద్ కాలనీలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదు. ఎస్‌డీ ఆసుపత్రి సబ్‌స్టేషన్ పరిధిలోని హుమాయూన్‌నగర్, క్రిసెంట్ ఆసుపత్రి, మెడివిజన్ ఆసుపత్రి, ఎన్ఎండీసీ, ఎన్‌టీఆర్ హౌస్, రసూల్ ఖాన్ హౌస్, రత్నదీప్, హుమాయున్ నగర్, మెహిదీపట్నం, శ్రీరామ్‌నగర్, మురాద్‌నగర్, పోలీస్ మెస్ ఫీడర్ పరిధిలోని అహ్మద్‌నగర్, మాసబ్‌ట్యాంక్, గార్డెన్ టవర్స్, ఖాజా మెన్షన్, ఖాదీ బోర్డు, పోలీస్‌మెస్, ఫస్ట్ లాన్సర్, డైమండ్ హోటల్, బంజారా ఫంక్షన్‌హాల్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

బాధ్యతల స్వీకరణ


సురేందర్‌రెడ్డి

నాంపల్లి: జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని మెహిదీపట్నం సర్కిల్–12 డిప్యూటీ కమిషనర్‌గా సురేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గత అక్టోబర్ నెల చివరిలో ఇక్కడ పనిచేసిన డీసీ సీహెచ్.నాగేశ్వరరావు పదవీ విరమణ చెందారు. సర్కిల్–12కు పూర్తిస్థాయి డీసీ నియామకం జరిగే వరకు గోషామహల్ డీసీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. సమగ్ర కుటుంబ సర్వే ఈ నెల 6న ప్రారంభం కానున్న నేపథ్యంలో మెహిదీపట్నం సర్కిల్–12కు పూర్తి స్థాయి డిప్యూటీ కమిషనర్‌ను నియమించారు. ఇందులో భాగంగా మంగళవారం నూతన డీసీగా సురేందర్‌రెడ్డి విధుల్లో చేరారు. తొలిరోజు సమగ్ర కుటుంబ సర్వేపై కసరత్తు చేశారు.

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి


అవగాహన కల్పిస్తున్న మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్

యాకుత్‌పురా: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మీర్ చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ సూచించారు. మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం దారుషిఫా సాలార్‌జంగ్ రోటరీ వద్ద హెల్మెట్ వాడకంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ దక్షిణ విభాగం డీసీపీ వేంకటేశ్వర్లు పర్యవేక్షణలో హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

పీస్ అండ్ వెల్ఫేర్ సభ్యులకు ప్రశంసాపత్రాలు



జియాగూడ: పండగలు శాంతియుతంగా జరగడానికి సహకరించిన సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులకు ప్రశంసా పత్రాలు అందజేసి గౌరవిస్తున్నట్లు కుల్సుంపురా ఏసీపీ మునావర్ అన్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి సౌత్ వెస్ట్ జోన్ పరిధిలోని పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఇటీవల జరిగిన రంజాన్, బోనాలు, మొహర్రం, గణేష్ చతుర్థి, మిలాద్–ఉన్–నబీ, దసరా, దీపావళి తదితర పండుగలకు సహకరించిన సభ్యులు భవిష్యత్‌లో జరిగే కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ సునీల్, శివలాల్, అత్తాపూర్ రాజేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతు చేయండి


శివకుమార్ యాదవ్

జియాగూడ: అధ్వాన స్థితిలో ఉన్న పురానాపూల్ నుంచి జియాగూడ కార్వాన్ రోడ్లకు మరమ్మతు చేయాలని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ శివకుమార్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఇంజినీర్ ఇన్ చీఫ్, ఖైరతాబాద్ జోన్ జీహెచ్‌ఎంసీ 13, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం జియాగూడలో మాట్లాడుతూ.. రెండేళ్ల నుంచి రోడ్లు బాగలేకపోవడంతో పాటు డ్రైనేజీ సమస్యలు, ట్రాఫిక్ సమస్యల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2013–14లో టోలీచౌకీ, 100 ఫీట్ల జాతీయ రహదారి పనులను ప్రారంభించారు. టోలీచౌకీ వంతెన నిర్మాణం పూర్తి కాగా, పురానాపూల్ రోడ్లు నేటికీ అసంపూర్తిగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో రోడ్లను ఆధునీకరించి ప్రజల మేలు చేయాలని వినతిపత్రంలో వెల్లడించారు.

కల్తీ కారంపొడిని విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

గన్‌ఫౌండ్రీ: విషపూరితమైన రంగులు, రసాయనాలు కలిపి కల్తీ మిర్చీ పొడర్‌ను తయారు చేస్తున్న గోదాంపై మంగళవారం సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. 30 కిలోల తాలు మిర్చీ పౌడర్, రంగులు కలిపిన 35 కిలోల కల్తీ మిర్చీ పౌడర్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రాజస్థాన్‌కు చెందిన రూపారామ్(39) గత కొంతకాలం క్రితం నగరానికి వచ్చి అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో బట్టల దుకాణం ప్రారంభించాడు. దుకాణం సరిగ్గా నడవకపోవడంతో కల్తీ కారం విక్రయాలను ప్రారంభించాడు. దీని కోసం ఉస్మాన్‌గంజ్‌లోని తన ఇంట్లోనే కారం ఫ్లోర్‌మిల్, ప్యాకింగ్ యంత్రాలను కొనుగోలు చేసి అమర్చాడు. స్థానిక ఏజెంట్ల నుంచి స్వస్తిక్ బ్రాండ్ కారంపొడి ప్యాకెట్లను కొనుగోలు చేశాడు. మార్కెట్లో తక్కువ నాణ్యత కలిగిన మిర్చిని కొనుగోలు చేసి వాటి నుంచి వచ్చిన తాలు మిర్చీ పౌడర్ విషపూరితమైన రసాయనాలు, రంగులు కలిపి నకిలీ కారం తయారు చేసి విక్రయిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అతని ఇంటిపై దాడి చేసి కల్తీ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు తుదిపరి దర్యాప్తు కోసం నిందితుడిని అఫ్జల్‌గంజ్ పోలీసులకు అప్పగించారు.

నేటి నుంచి సమగ్ర సర్వే

- రెండు రోజుల పాటు స్టిక్కర్లు అతికింపు
- 8 నుంచి కుటుంబ వివరాల సేకరణ
- అదేరోజు కంప్యూటర్‌లో నమోదు


సర్వేకు సిద్ధం చేసిన ఫారాలు

నాంపల్లి: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఒక పొయ్యిని ప్రామాణికంగా తీసుకుని కులగణన చేపడుతారు. ఈ పొయ్యితోనే ఉమ్మడి కుటుంబాలు ఎన్ని? విడిపోయిన కుటుంబాలు ఎన్ని? ఈ కుటుంబ స్థితిగతులేమిటనే గణాంకాలు తెలుస్తాయి. పొయ్యి ఉన్న ప్రతి ఇంటికి ఎన్యుమరేటర్లు స్టిక్కరు అతికిస్తారు. ఈ స్టిక్కర్లు అతికించే కార్యక్రమం ఈ నెల 6న బుధవారం ఉదయం నుంచి ప్రారంభం అవుతుంది. రెండు రోజుల పాటు ప్రతి ఇంటికి స్టిక్కర్లు అతికిస్తారు. 8వ తేదీ నుంచి స్టిక్కర్లు అతికించిన ప్రతి ఇంటి వివరాలను సేకరిస్తారు. వివరాలు సేకరించిన కుటుంబాల సర్వే లెక్కలను అదేరోజు వార్డు ఇన్‌చార్జి పర్యవేక్షణలో కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తారు.

603 ఎన్యుమరేటర్లు.. 90 వేల కుటుంబాలు..

నాంపల్లి నియోజకవర్గంలో మొత్తం 90 వేల కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాలను 603 బ్లాకులుగా విభజించారు. 603 ఎన్యుమరేటర్లు ఈ కుటుంబాలను పంచుకుంటారు. ఒక్కో ఎన్యుమరేటర్ రోజుకు పది చొప్పున కుటుంబాలకు స్టిక్కర్లను అతికించి వివరాలు సేకరిస్తారు. ఈ కుటుంబ సర్వేలో స్వయం సహాయక బృందాల సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, బీఎల్‌ఓలతో పాటుగా సెకండరీ గ్రేడ్ టీచర్లు పాల్గొంటారు. వీరికి స్థానిక నేతలు, కార్పొరేటర్లు సహకరిస్తారు. వివరాలను సేకరించిన ఎన్యుమరేటర్లకు ఒక్కొక్కరికి రూ.10వేలు నగదు చెల్లిస్తారు. ఒక్కో ఎన్యుమరేటర్ 150 ఇళ్ల వివరాలను సేకరించి వార్డు ఇన్‌చార్జులకు అప్పగిస్తారు. ఒక్కో ఇంటిని ఒక ఎన్యుమరేటర్ రెండు పర్యాయాలు సందర్శిస్తారు.

యజమాని చెప్పిన వివరాల ఆధారంగానే..

ఎన్యుమరేటర్లు వివరాలన్నింటిని సమగ్రంగా సేకరిస్తారు. యజమాని చెప్పిన వివరాల ఆధారంగానే సర్వేను చేస్తారు. వీరు ఎలాంటి ఫొటోలు, డాక్యుమెంట్లను తీసుకోరు. ఇప్పటికే జీహెచ్‌ఎంసీ ఫీల్డ్‌లో ఉండే ఎన్యుమరేటర్లకు మెటీరియల్‌ను అందజేసింది. వీరంతా ఉదయాన్నే నియోజకవర్గంలోని ఏడు డివిజన్లలో సర్వేను ప్రారంభిస్తారు. నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ మహారాష్ట్ర పర్యటనలో ఉన్నందున జీహెచ్‌ఎంసీ అధికారులే సర్వేను అధికారికంగా ప్రారంభిస్తారు. ఈ సర్వేను ఇద్దరు ఏఎంసీలు, ఏడుగురు వార్డ్ ఇన్‌చార్జీలు, 44 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తారు.


కుటుంబ సర్వే అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి..

గోల్కొండ: నేటి నుంచి ప్రారంభం కానున్న కుటుంబ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ హకీంపేట్ మిరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. పేద, బడుగు వర్గాల కుటుంబాల్లో నేటికి చాలా మంది నిరక్షరాస్యులే అని వారందరికీ ఈ సర్వే గురించి వివరించి వారి నుంచి సరైన సమాధానాలు రాబట్టి రిపోర్టు తయారు చేయాలన్నారు. తమ కోటా పూర్తి చేసుకోవడానికి ఆదరాబాదరాగా సర్వేను ముగించకుండా మొత్తం సర్వే పూర్తి అయ్యే వరకు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ డివిజన్ సర్వే అధికారిని హిమబిందు తదితరులున్నారు.

సర్వేకు సహకరించాలి..

సమగ్ర సర్వేను విజయవంతం చేయడానికి ప్రజలు సహకరించాలని బల్దియా డిప్యూటీ కమిషనర్, కార్వాన్ నియోజకవర్గం సర్వే అధికారి శశిరేఖ అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ కుటుంబ సర్వేలో పాల్గొంటున్న సిబ్బందికి శిక్షణ నిర్వహించి సర్వేపై సరైన అవగాహన కల్పించామన్నారు. బుధవారం ఉదయం నుంచే సర్వేయర్లు ప్రతి ఇంటికి వచ్చి కుటుంబ పెద్దను కలిసి వివరాలను సేకరిస్తారన్నారు.

ఎన్యుమరేటర్లకు మెటీరియల్ అందజేత..

బహదూర్‌పురా: చార్మినార్ జోన్ ఫలక్‌నుమా సర్కిల్–10 డిప్యూటీ కమిషనర్ అరుణ కుమారి మంగళవారం తన కార్యాలయంలో ఎన్యుమరేటర్లకు స్టేషనరీ కిట్, మెటీరియల్‌ను అందజేశారు. ఎన్యుమరేటర్లు, సిబ్బంది కిట్టును వాడుకుంటూ విధులు నిర్వహించాలని సూచించారు. సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు పూర్తిగా సహాయ సహకారాలు అందించాలని డిప్యూటీ కమిషనర్ సూచించారు.



ఆలయాలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం



అఫ్జల్‌గంజ్: పలు ఆలయాలపై వరుసగా జరుగుతున్న దాడులను అరికట్టడంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్ ఆరోపించారు. శంషాబాద్ ప్రాంతంలో ఒక ఆలయం దాడి జరగడం బాధాకరమన్నారు. నగరానికి వచ్చిన జాతీయ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ తమ పార్టీ పాలనలో ధ్వంసమైన ఆలయాలను సందర్శించి ఇస్లామిక్ మతోన్మాదంపై తమ వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆలయాలపై దాడిచేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

పోటీలకు ఆహ్వానం

చార్మినార్: ఈనెల 14న ఆల్ ఇండియా జవహర్ లాల్ నెహ్రూ స్కూల్ చెస్ టోర్నమెంట్ ఓపెన్ స్కూల్ చెస్ టోర్నమెంట్ బాల బాలికల కోసం అండర్–16 విభాగంలో పోటీలు నిర్వహించనున్నామని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రీ తెలిపారు. పోటీల్లో పాల్గొనడానికి ఈనెల 12వ తేదీ ఆఖరు అని ఆయన స్పష్టం చేశారు. నగరంలో జరిగే ఈ పోటీలలో ఆటగాళ్లందరూ గెలిచినా ఓడినా అన్ని రౌండ్లు ఆడవచ్చునన్నారు. సరిఫికెట్లతో పాటు విజేతలకు ప్రైజ్ మనీ, మెరిట్ సర్టిఫికేట్, మెడల్స్‌ను అదే రోజు అందజేయడం జరుగుతుందన్నారు. జనవరి 1, 2008 తర్వాత జన్మించిన వారు ఈ టోర్నమెంట్‌కు అర్హులన్నారు. మరిన్ని వివరాల కోసం 8500212306 వాట్సాప్ నెంబర్, www.apjedu2001. com వెబ్ సైట్‌లో సంప్రదించాలన్నారు.

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించండి


చౌమహల్లా ప్యాలెస్ వద్ద ఏర్పడిన ట్రాఫిక్ జామ్

శాలిబండ: చౌమహల్లా ప్యాలెస్ ప్రాంతంలో ప్రతిరోజు గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో వాహనదారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చౌమహల్లా ప్యాలెస్ సందర్శనార్థం నిత్యం వందలాది మంది పర్యాటకులు వస్తుండటంతో ట్రాఫిక్ జామ్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇక్కడ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ పోలీసులు అందుబాటులో లేకపోవడంతో సమస్య మరింత జఠిలంగా తయారయ్యింది. ప్యాలెస్ సందర్శనకు వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో పార్కింగ్‌ను ఇష్టానుసారంగా చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఇక్కడ ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని వాహనదారులు, వ్యాపారులు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత

అబిడ్స్: ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు వరకుమార్ గుప్తా పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మానసికంగా, సంతోషంగా, ఆనందంగా ఉజ్వల జీవితం గడిపేందుకు ఆధ్యాత్మిక భావాలు ఎంతో అవసరమన్నారు. ఉత్తర భారతీయ ఆధ్యాత్మిక గురువులు అనిల్‌కుమార్ శాస్త్రి, రంజిత్ శాస్త్రీలను వరకుమార్‌గుప్తా కలిసి వారి ఆశీర్వాదాన్ని పొందారు. అనంతరం వరకుమార్ గుప్తా మాట్లాడుతూ..తమ వాసవీక్లబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిరంతరం పలు సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రజల్లో భక్తి భావాలు పెంపొందించే విధంగా వాసవీక్లబ్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రిదేవి, దీనబంధు గుప్తా, విశిష్ఠ తదితరులు పాల్గొన్నారు.


ఆధ్యాత్మిక గురువులు అనిల్‌కుమార్ శాస్త్రి, రంజిత్ శాస్త్రీలను కలిసిన వరకుమార్‌గుప్తా

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

- 12 గంటల్లోనే కేసును ఛేదించిన అఫ్జల్‌గంజ్ పోలీసులు


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న డీసీపీ బాలస్వామి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఉస్మానియా ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చిన ఓ తండ్రి వద్ద నుంచి నాలుగు ఏళ్ల బాలుడిని కిడ్నాప్ చేసిన కేసును అఫ్జల్ గంజ్ పోలీసులు 12 గంటల్లో పరిష్కరించారు. మంగళవారం అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీసీపీ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..మాంగార్‌బస్తీకి చెందిన మహ్మద్ సద్దాం, రుబినా బేగం దంపతులు. కొన్ని నెలలుగా సద్దాం అనారోగ్యంతో బాధపడుతూ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఈ నెల 4న వారి చిన్న కుమారుడు అయిన మహ్మద్ సోహేబ్(4)ను తీసుకొని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చారు. వైద్య చికిత్సల అనంతరం మద్యం సేవించిన సద్దాం కుమారుడిని తీసుకొని ఆసుపత్రి ఓపీ భవనం వద్ద నిద్రించాడు. ఇదే అదనుగా భావించిన షేక్ రఫిక్ (35) అడ్డాకూలీగా పనిచేస్తూ మద్యానికి బానిసై ఫుట్‌పాత్‌లపైనే నివసిస్తుంటాడు. ఒంటరిగా ఉన్న బాలుడిని గుర్తించిన షేక్ రఫీక్ డబీర్‌పురా రైల్వే స్టేషన్‌కు వద్దకు తీసుకెళ్లి ఓ మహిళకు అప్పగించాడు. రాత్రి అయినా తన భర్త సద్దాం, కుమారుడు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన రుబినాబేగం ఆసుపత్రికి వచ్చి మద్యం మత్తులో ఉన్న తన భర్తను కుమారుడు ఎక్కడ అడిగింది. ఇద్దరూ కలిసి ఆసుపత్రి ఆవరణలో వెతికారు. బాలుడి ఆచూకి లభించకపోవడం అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్‌రావు కేసు నమోదు చేసుకొని తన బృందంతో కలిసి నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేశారు. రైల్వేస్టేషన్, బస్ స్టేషన్ల వద్ద ఉన్న సీసీ కెమెరాలతో బాలుడి ఆచూకి కోసం గాలించారు. బాలుడిని చేత పట్టుకొని కిడ్నాపర్ షేక్ రఫీక్ నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలను గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించగా డబ్బుల కోసం ఒక మహిళ వద్ద బాలుడిని ఉంచినట్లు తెలిపారు. వెంటనే అక్కడకు వెళ్లి బాలుడిని సురక్షితంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు.

గంజాయి తాగుతున్న వ్యక్తికి జైలు

గౌలిపురా: గంజాయి తాగుతున్న ఓ వ్యక్తికి నెల రోజుల జైలు శిక్ష పడిన ఘటన భవానీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా రోడ్డు నంబర్–6కు చెందిన సమీ అలీ (30) భవానీనగర్ స్టేషన్ పరిధిలో ఇటీవల గంజాయి తాగుతూ పోలీసులకు చిక్కాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని మంగళవారం నాంపల్లిలోని కోర్టులో హాజరు పరిచారు. స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ డి.సి.ఉమాపతి రావు నిందితునికి నెల రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిని కలిసిన మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ



చార్మినార్: రాష్ట్రంలో జరుగుతున్న సభ్యత నమోదు కార్యక్రమంలో భాగంగా మైనార్టీల సభ్యత్వ నమోదుపై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌ను కలిసి వివరించామని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిని కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు మోదీ ప్రభుత్వ కార్యక్రమాలు, తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి వినూత్న పథకాలను అభివృద్ధి చేయడం, త్వరితగతిన అమలు చేయడం ముఖ్యంగా ముస్లిం మైనారిటీలో సభ్యత్వ డ్రైవ్ తదితర అంశాలపై ఆయనతో చర్చించడం జరిగిందన్నారు.

కన్నయ్య మిట్టల్‌కు సన్మానం


కన్నయ్య మిట్టల్‌ను సన్మానిస్తున్న ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు

అబిడ్స్: ప్రముఖ ఆధ్యాత్మిక గాయకుడు కన్నయ్య మిట్టల్‌ను బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు ఘనంగా సన్మానం చేశారు. శ్యామ్‌బాబా భక్తి గీతాలతో పాటు భజనలు, ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తూ అందరిని అబ్బుర పరుస్తున్న ప్రముఖ గాయకుడు కన్నయ్య మిట్టల్ నగరానికి వచ్చిన సందర్భంగా ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు ఆయనను సత్కరించి ప్రశంసించారు. అనంతరం లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ..ప్రజల్లో భక్తిభావాలు పెంపొందిస్తున్న ఘనత కన్నయ్య మిట్టల్‌దేనని కొనియాడారు.

'మత్స్యకారులను దగా చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం'


మెట్టు సాయికుమార్

అబిడ్స్: గత పదేళ్ల మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులను పలు విధాలుగా దగా చేశారని రాష్ట్ర ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముదిరాజులను, గంగపుత్రులను పట్టించుకోలేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి అన్ని చెరువులలో ఉచితంగా చేపపిల్లలను వదులుతుంటే.. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో 571 మంది మత్స్యకారులు చనిపోతే కనీసం వారి కుటుంబాలను కానీ, వారికి ఎక్స్‌గ్రేషియా కానీ ఇవ్వలేదని మెట్టు సాయికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి గత ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం.. మత్స్యకారులకు, ముదిరాజులకు పలు విధాల సంక్షేమం చేస్తుంటే కేటీఆర్, హరీష్‌రావు జీర్ణించుకోలేక దిగజారే విధంగా ప్రకటనలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వారి చేష్టలు మార్చుకోవాలని లేనిచో మరోసారి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని మెట్టు సాయికుమార్ అన్నారు.

దాశరథి పేరుతో స్మారక భవనాన్ని నిర్మించాలి


దాశరథి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నందిని సిధారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: దాశరథి పేరుతో ఒక స్మారక భవనాన్ని నిర్మించాలని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో మహాకవి దాశరథి కృష్ణమాచార్య 37వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిధారెడ్డి మాట్లాడుతూ..దాశరథి రచనలు చదవకపోతే దశరథికి నష్టం లేదు కానీ..నేటి కవులకు, రచయితలకు, సమాజానికి చాలా నష్టమన్నారు. అంతకు ముందు సాహిత్య అకాడమీ ప్రచురిస్తున్న పునాస, దశరథి రాసిన కథలతో ముద్రించిన నిప్పు పూలు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి టి.ఉయడవర్లు, రచయితల సంఘం అధ్యక్షులు నాళేశ్వరం శంకరం, దాశరథి అల్లుడు గౌరీ శంకర్, ఆచార్య పిల్లలమర్రి రాములులతో పాటు పలువురు సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

యువకులు సమాజ సేవలో పాల్గొనాలి

గోల్కొండ: యువకులు సమాజ సేవలో చురుగ్గా పాల్గొనాలని ఇంటర్నేషనల్ హ్యూమెన్ రైట్స్ పీస్ అంబాసిడర్ మహ్మద్ నజీబ్ అన్నారు. మంగళవారం టోలిచౌకీలోని టీఎఫ్‌సీఓ కార్యాలయంలో ఆయన పలువురు యువకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా తాను మానవ హక్కుల పరిరక్షణ కోసమే కాకుండా నిరుపేదలకు అండగా ఉంటున్నానన్నారు. ఈ 15ఏళ్ల కాలంలో ఎందరో యువకులు తమ సంస్థలో చేరి సమాజ సేవలో పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు.

మాస్టర్ మైండ్ పోటీలకు మెహిదీపట్నం విద్యార్థులు

గోల్కొండ: శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న మాస్టర్ మైండ్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు హాజరవుతున్నట్లు శ్రీ చైతన్య మెహిదీపట్నం జోన్ ఏజీఎం బి.కృష్ణ, ప్రిన్సిపాల్ స్వాతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు గణిత అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం బి.కృష్ణ, ప్రిన్సిపాల్ స్వాతి మాట్లాడుతూ..బుధవారం దేశవ్యాప్తంగా ఉన్న శ్రీచైతన్య పాఠశాలల ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు మాస్టర్ మైండ్ పేరుతో గణితంలో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డ్ పోటీల్లో పాల్గొంటున్న తమ పాఠశాల విద్యార్థులకు వినూత్న పద్ధతుల ద్వారా సులభ శైలిలో గణితశాస్త్రంలో ఎలా రాణించవచ్చు అనే అంశంపై శిక్షణ ఇచ్చాం. దీంతో ఈ పోటీల్లో తమ విద్యార్థులు మంచి ప్రతిభను చాటుతారనే నమ్మకం ఉంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు హరికృష్ణ, శ్రీరాం రెడ్డి పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


కార్వాన్ నియోజకవర్గం నుంచి రాహుల్‌గాంధీ సభకు బయలుదేరి వెళ్తున్న కాంగ్రెస్ నేతలు


రాహుల్‌గాంధీ సభకు తరలిన పాతబస్తీ నేతలు


రాహుల్ గాంధీని కలిసిన ఫిరోజ్ ఖాన్

గౌలిపురా: తెలంగాణలో కులగణన చేపడుతున్న సందర్భంగా కుల గణన కార్యక్రమాన్ని సమీక్షించేందుకు బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో జరిగే రాహుల్‌గాంధీ సభకు పాతబస్తీ కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. రాహుల్‌గాంధీకి బేగంపేట్ ఎయిర్‌పోర్టులో పాతబస్తీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్, శాలిబండ డివిజన్ అధ్యక్షులు టి.చంద్రశేఖర్, సీనియర్ నేత మహ్మద్ మూసా ఖాసి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

కార్వాన్ నుంచి..

గోల్కొండ: తెలంగాణలో ఉన్నది ప్రజా ప్రభుత్వం అని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్‌బిన్ మహ్మద్ అల్‌హాజిరీ అన్నారు. నగరంలో మంగళవారం జరిగిన రాహుల్‌గాంధీ బహిరంగ సభకు ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి కార్వాన్ నుంచి బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి చకోలేకర్ శ్రీనివాస్, తూమ్‌కుంట అరుణ్‌కుమార్, కురాకుల కృష్ణ, శంకర్, కృష్ణమూర్తి, దుర్గాప్రసాద్, దర్శన్, జగన్‌గౌడ్ తదితరులున్నారు.

నాంపల్లి: నగరానికి వచ్చిన ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని రాష్ట్ర కాంగ్రెస్ నేత మహ్మద్ ఫిరోజ్ ఖాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు మంగళవారం బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న రాహుల్ గాంధీకి ఫిరోజ్‌ఖాన్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీని సన్మానించారు.